టెట్ పరీక్ష కేంద్రాల ఏర్పాటు లోపభూయిష్టం

- ఎస్‌టియు టిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నిర్వహించనున్న టెట్ పరీక్షలకు సుదూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనున్నట్టు ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. సదానందం గౌడ్, జుట్టు గజేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సమీప జిల్లాల్లోనే పరీక్ష కేంద్రాలు కేటాయించేలా పాఠశాల విద్యా శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పరీక్షలు రాసే ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

విశ్వనాథ్ కార్తికేయకు పిఎం రాష్ట్రీయ బాల పురస్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాన్ని హైదరాబాద్‌కు చెందిన పర్వతారోహకుడు విశ్వనాథ్ కార్తికేయకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. 7 సమ్మిట్ ఛాలెంజ్‌ను పూర్తి చేసిన అత్యంత పిన్న వయసు భారతీయుడిగా, ప్రపంచ వ్యాప్తంగా రెండో అత్యంత పిన్న వయస్కుడిగా జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 26ను గురు గోబింద్ సింగ్ కుమారుల వీరమరణాన్ని స్మరించుకుంటూ వీర్ బాల్ దివస్‌గా జరుపుకుంటారు. ఈ సందర్భంగా 18 ఏళ్ల లోపు పిల్లలకు ఆరు విభాగాల్లో పురస్కారాలను అందజేస్తారు.



భిన్న భావజాలల వేదిక హైదరాబాద్ బుక్ ఫెయిర్

- జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రదర్శన సందర్శించిన సుప్రీంకోర్ట్ పూర్వ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఒకే ప్రాంగణములో వీర సావర్కర్ ఆర్ ఎస్ ఎస్ భావజాల రచనలు గాంధీజీ నెహ్రూ వంటి దేశ నాయకుల గ్రంథాలు మరో వైపు మార్క్స్, లెనిన్ కమ్యూనిజం ఆలోచనకు చెందిన సంపుటిలు ఇలా భిన్న భావాలు వేదికగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ పలు రకాల పుష్ప వనంలా ఉందని పేర్కొన్నారు. విభిన్న విరుద్ధ భావాలు ప్రజలకు చేరువ చేయటం పుస్తక ప్రదర్శనల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ బాధ్యత ఎట్టి వివక్షతకి తావు లేకుండా హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ కార్యవర్గం నిర్వహిస్తోందని అన్నారు.

డ్రగ్స్ విచారణ నివేదిక ఏమైంది...?

- కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో ఐపిఎస్ అధికారి అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారు. పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే.. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదిక, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సిఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీమ్‌కు అప్పగించలేదు.. వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సిఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలి. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

లెప్రసీ సర్వేకు అదనపు డబ్బులు చెల్లించాలి

- ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాల్సిందే
- రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఆశాల ధర్నాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిసెంబర్ నెలలో నిర్వహించే లెప్రసీ సర్వేకు ఆశా కార్యకర్తలకు అదనంగా డబ్బులు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శనివారం కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. అందులో భాగంగా ఆశా వర్కర్లు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. డిసెంబర్‌లో చేపట్టే లెప్రసీ సర్వేకు సంబంధించి ఆశాలకు చెల్లించే అదనపు పారితోషికంపై స్పష్టత ఇవ్వాలన్నారు. గత ఏడాది పోరాటం చేస్తేనే డబ్బులు వచ్చాయని, ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి పునరావృతం కావడం ఆశాలను ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు. మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న సర్వే డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. కేంద్రం పెంచిన పారితోషికాలను రాష్ట్ర ప్రభుత్వం యథావిధిగా అమలు చేయాలని, 2021 జులై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని, ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. పారితోషికం లేని పనులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆశా వర్కర్ల ప్రతినిధి బృందం అదనపు కలెక్టర్ పి.కదిరవన్‌ను కలిసి అందజేశారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సౌత్ జిల్లా కమిటీ అధ్యక్షులు ఎం.మీనా, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు ఎం.దశరథ్, కార్యదర్శి జె.కుమారస్వామి, ఆశా యూనియన్, సీఐటీయూ సౌత్ సిటీ నాయకులు జి.విఠల్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షురాలు టి.యాదమ్మ, ప్రధాన కార్యదర్శి ఎ.కృష్ణవేణి, కోశాధికారి ఎస్.సారాబాబు, సౌత్ సిటీ నాయకులు రాధిక, సఫియా ఉన్నిస్సా పాల్గొన్నారు.

జిల్లాల్లో..

వికారాబాద్, కరీంనగర్ జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఆశావర్కర్లు ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే డబ్బులు తక్షణమే ఇవ్వాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పెద్దఎత్తున హాజరయ్యారు. అంతకుముందు సీఐటీయూ నాయకులు కలెక్టరేట్ ముందున్న భారీకేడ్లను తొలగించి గేటు ముందు బైటాయించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మర్రికుంట నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ, అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ ముందర ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. అక్కడికి వచ్చిన వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు.

డెస్క్ జర్నలిస్టులకు న్యాయం చేయండి

- వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు
- ప్రభుత్వాన్ని కోరిన డెస్క్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అక్రిడిటేషన్లు, మీడియా కార్డుల పేరుతో వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దని డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డిజెఎఫ్‌టి) రాష్ట్ర అధ్యక్షులు బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె మస్తాన్ ప్రభుత్వాన్ని కోరారు. డెస్క్ జర్నలిస్టులకు పాత పద్ధతిలోనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట నిరసన చేపట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. అందులో భాగంగా లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల డెస్క్ జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరవ్వగా.. టిడబ్ల్యుజెఎఫ్, హెచ్‌యుజె, ఎస్‌జాట్ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా డిజెఎఫ్‌టి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు తీసేసి మీడియా కార్డులు ఇవ్వడం సరికాదన్నారు. ఇది జర్నలిస్టుల పట్ల వివక్ష చూపినట్టవుతుందన్నారు. జీవో నెంబర్ 252ను సవరించాలని, స్పోర్ట్స్, సినిమా, ఫీచర్స్, వెబ్, కల్చరల్, బిజినెస్, కార్టునిస్టులకు గతంలో మాదిరిగానే అక్రిడిటేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. డీజేఎఫ్‌టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.విజయ మాట్లాడుతూ.. జర్నలిస్టుల మధ్య విభజన తీసుకురావడం సరికాదని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒను వెంటనే సవరించడంతోపాటు గతంలో మహిళా జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న అక్రిడిటేషన్లలో 33శాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ కదిరవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజేఎఫ్‌టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ రాజారామ్, కోశాధికారి నిసార్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, కార్యదర్శి బి.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లో..

అక్రిడిటేషన్లకు సంబంధించి 252 జిఒను సవరించాలని కోరుతూ మిగతా జిల్లాల్లోనూ ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కలెక్టరేట్ల ఎదుట డెస్కు జర్నలిస్టులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, డెస్క్, కేబుల్, ఇండిపెండెంట్ జర్నలిస్టులు పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జర్నలిస్టుల ఆందోళనకు వివిధ జర్నలిస్టు సంఘాలు మద్దతు తెలిపాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టరేట్ల ఎదుట భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. వర్కింగ్ జర్నలిస్టులను విభజించకుండా అర్హులైన అందరికీ అక్రిడిటేషన్లు జారీ చేయాలని ఆదిలాబాద్ కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. డెస్క్ జర్నలిస్టులపై ప్రభుత్వం వివక్షత వీడాలని జీఓ నెం.252ను రద్దు చేయాలంటూ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా సబ్‌ఎడిటర్లు డిమాండ్ చేశారు. ఇంకా మిగతా చోట్ల కూడా జర్నలిస్టులు కార్యక్రమాలు నిర్వహించారు.



బెయిల్‌ను రద్దు చేయాలి

- కుల్దీప్ సెంగార్‌కు జీవితఖైదు కొనసాగించాలి : ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ జీవితఖైదు కొనసాగించాలనీ, ఆయనకిచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉన్నావ్ కేసులో లైంగిక దాడి, కుటుంబ సభ్యుల హత్య కేసులో సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు జీవితఖైదును నిలిపేసి బెయిల్ ఇస్తూ తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి చౌరస్తా నుంచి సుందరయ్య పార్కు వరకు ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ సెంగార్ నేరస్తుడనీ, అతనికి ఎలాంటి పదవి, పరిపాలన, రాజకీయ అండదండలు, న్యాయపరమైన రక్షణ కల్పించకూడదని డిమాండ్ చేశారు. సెంగార్ మైనర్ బాలికకు ఉద్యోగం ఇప్పిస్తానని ఇంటికి రప్పించుకుని లైంగికదాడికి పాల్పడ్డారని తెలిపారు. సెంగార్, అతని అనుచరులు కేసును ఉపసంహరించుకోకుంటే చంపేస్తామని బాధితురాలిని బెదిరిస్తున్నారని చెప్పారు. బాధితురాలికి, ఆమె తల్లికి రక్షణ కల్పించాలని, హైకోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్లాలని సీబీఐను డిమాండ్ చేశారు. బెయిల్ రద్దు చేసేంత వరకు బాధితురాలిగా ఐద్వా అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు కెఎన్.ఆశాలత, బుగ్గవీటి సరళ, సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి, పాలడుగు ప్రభావతి, బట్టుపల్లి అనురాధ, బండి పద్మ, కె నాగలక్ష్మి, ఎం వినోద, పి.శశికళ, వై వరలక్ష్మి, ఎ.శారద, మస్తాన్ బి పాల్గొన్నారు.

29,30 తేదీల్లో టాప్ర మహాసభ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ 6వ రాష్ట్ర మహాసభ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిశంబర్ 29,30 తేదీల్లో జరుగుతాయని మహాసభల ఆహ్వాన సంఘం చైర్మెన్ ఎంఎన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రంగాల పెన్షనర్ల సంక్షేమం గురించి, హక్కుల గురించి చర్చించే ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని టాప్ర రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ఎం.రంగయ్య, ఎం నరహరి, ఎం జనార్ధన్ రెడ్డి, డాక్టర్ ఎల్ అరుణ, ఎన్ సోమయ్య, డాక్టర్ స్వరాజ్ కుమార్, జి అశోక్ తదితరులు పాల్గొని మహాసభల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల్లో కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ, ఇపిఎఫ్, సింగరేణి పెన్షనర్ల సమస్యలపై చర్చించడానికి ఎన్‌సిసిపిఎ, ఎఫ్‌సిపిఎ, సెక్రెటరీ జనరల్ కె.రాఘవేంద్రన్, ప్రొఫెసర్ కె నాగేశ్వర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అలాగే ప్రముఖ వైద్యులు అఖిల్ దాడి, మాజీ ఎమ్మెల్సీ ఎ నర్సిరెడ్డి, సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, టిజిజెఎసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఇ శ్రీనివాస్ రావు, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవితో పాటు ఎం.సంయుక్త, పద్మశ్రీ తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

పెన్షన్స్ పెంపు నిర్ణయాన్ని ప్రకటించాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక

హైదరాబాద్ బ్యూరో

వికలాంగులతో పాటు చేయూత పెన్షన్స్ పెంచుతూ డిసెంబర్ 29 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి)తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి వరమ్మ, అధ్యక్షులు కె.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్లుగా పెన్షన్స్ పెంచకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. అధికారంలోకి వస్తే 2023 డిసెంబర్ నుంచే పెంచిన పెన్షన్స్ అమలు చేస్తామని పీసీసీ అధ్యక్షుని హోదాలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. ఆ హామీ అమలు కోసం రెండేండ్లుగా 44 లక్షల మంది చేయూత పెన్షన్ దారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రెండేండ్లు పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన సంబరాలను ఘనంగా నిర్వహించిన ప్రభుత్వం పెన్షన్ విషయంలో మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులు ఉన్నారనే కారణం చూపిస్తూ గడిచిన రెండేండ్లలో లక్షలాది మంది చేయూత పెన్షన్స్ రద్దు చేసిన ప్రభుత్వం వాటి స్థానంలో కొత్త పెన్షన్స్ మంజూరు చేయలేదని తప్పుపట్టారు. అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్స్ పెంచుతు ప్రకటన చేయకుంటే ఉద్యమం చేస్తామని వారు హెచ్చరించారు.

ఫిబ్రవరి 7, 8 తేదీల్లో తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్

- పోస్టర్ ఆవిష్కరించిన సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7,8 తేదీల్లో హైదరాబాద్ దోమల్‌గూడలోని ఏవీ కాలేజీలో లిటరరీ ఫెస్ట్ జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రకృతి కవి జయరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి మాట్లాడుతూ ఫిబ్రవరి 7,8 తేదీల్లో తెలంగాణ సాహితి దశాబ్ది సాహిత్యోత్సవాలు జరుగుతాయని వివరించారు. సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్ మాట్లాడుతూ ఈ దశాబ్దంలో రాష్ట్రంలో వచ్చిన సాహిత్యాన్ని గ్రంథస్తం చేస్తూ తెలంగాణ సాహితి ప్రత్యేక సంచికను తేవడం గొప్ప పని అని అన్నారు.

సుదూరంగా టెట్ పరీక్షా కేంద్రాల కేటాయింపు తగదు

- ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ ఇవ్వాలి
- టిఎస్ యుటిఎఫ్

హైదరాబాద్ బ్యూరో : టెట్ పరీక్షకు హాజరయ్యే ఉపాధ్యాయుల పరీక్ష, ప్రయాణ సమయాన్ని ఆన్ డ్యూటీగా మంజూరు చేయాలని టీఎస్ యుటిఎఫ్ కోరింది. ఈ మేరకు శనివారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ మౌలిక నిబంధనలు 9 (6) సబ్ క్లాజ్ బి (3) ప్రకారం శాఖాపరమైన పరీక్షలకు హాజరయ్యే ఉద్యోగులకు పరీక్ష, ప్రయాణ కాలాన్ని ఆన్ డ్యూటీ గా పరిగణిస్తారని వారు గుర్తుచేశారు. జనవరి మూడు నుంచి 20 వరకు జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కేంద్రాలను సుదూరంగా కేటాయించారని తెలిపారు. దీంతో పరీక్షార్థులు రెండు నుంచి మూడు వందల కిలోమీటర్ల దూరంలో పరీక్షా కేంద్రాలకు హాజరు కావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదాహరణకు నిర్మల్ నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి ఖమ్మం కేటాయించినట్టు తెలిపారు. ఏ ప్రాతిపదికన పరీక్షా కేంద్రాలు కేటాయించారో తెలియదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీంతో అభ్యర్థులు మాత్రం ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్లు రెండేండ్లలో టెట్ పాస్ కావలసి ఉన్నందున ఈ సారి పెద్ద సంఖ్యలో పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయాలి

హైదరాబాద్ బ్యూరో : గతంలో బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులపై వివక్ష చూపుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి పాలన డైవర్షన్, కరప్షన్ అన్న రీతిలో కొనసాగుతున్నదని ఆరోపించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో హిమాలయ కన్వెన్షన్ హాల్లో శనివారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టులు పూర్తి కావాలంటే ఈ ప్రాంత ప్రజలు తెలంగాణ ఉద్యమ స్థాయిలో కదలాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో గద్వాల -మాచర్ల రైల్వే లైన్ ఏర్పాటుకు నోచుకోలేదని స్వరాష్ట్రంలోనైనా కల నెరవేరుతుందేమో నని కలలు కన్నామన్నారు. రాష్ట్రం వచ్చి 12 సంవత్సరాలు కావస్తున్న రైల్వే లైన్ పూర్తి కాకపోవడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 34 శాతం అటవీ ప్రాంతం ఉందని, 25 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నా 6,500 ఎకరాలు మాత్రమే సాగునీరు పారడం పాలకుల వైఫల్యాలకు నిదర్శనమని విమర్శించారు. శ్రీశైలం ఉమ్మడి ప్రాజెక్టు నుంచి కాకుండా జూరాలకు సమాంతరంగా రిజర్వాయర్ నిర్మించి సాగునీటిని సరఫరా చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు నిర్వాకం వల్ల కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మూడు పంపులే పని చేస్తున్నాయని విమర్శించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ జలదోపిడీ చేస్తుంటే సిఎం రేవంత్‌రెడ్డి గుడ్లు అప్పగించి చూడటం సరికాదన్నారు.

ప్రతి ఒక్కరూ మంచి పుస్తకాలు చదవాలి

- హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజాశక్తి - కల్చరల్



పుస్తకాలు చదవడం అభ్యాసం ఐతే మానసిక ఆరోగ్యం ప్రశాంతికి దోహదపడుతుందని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ చెప్పారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను బండారు దత్తాత్రేయ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బుక్ ఫెయిర్ సొసైటీ ప్రతినిధులు భారత రాజ్యాంగం ప్రతి బహుకరించారు. దత్తాత్రేయ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి స్టాల్‌ను చూసి తమకు ఆసక్తి ఉన్న అంశాలకు చెందిన పుస్తకాలు హృదయానికి హత్తుకోవాలని సూచించారు. తన జీవితంను నెపోలియన్‌ది గ్రేట్ పుస్తకం ప్రభావితం చేసిందని అన్నారు. అసాధ్యం అనే పదం లేదని అనే స్ఫూర్తితోతను సమాజ సేవలో నిమగ్నమయ్యానని చెప్పారు. దేశ ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష అనుభవించిన సమయంలో భగవాద్గీత, కరోనా కాలంలో భాగవంతం చదవడం వల్ల ధైర్యం శక్తి లభించాయలని చెప్పారు. చదువు వినమ్రతతో విజ్ఞానం ఇస్తుందని అన్నారు. బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు యాకుబ్ కార్యదర్శి వాసు పాల్గొన్నారు.

శాసన సభను రచ్చబండగా మార్చొద్దు

- నిర్మాణాత్మక చర్చలు జరపాలి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసన సభను రచ్చబండగా మార్చొద్దని మాజీ శాసన సభ్యులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నెల 29 నుంచి ప్రారంభమయ్యే శాసనసభ శీతాకాల సమావేశాల్లో పాలకపక్షం, ప్రతిపక్షం తమ రాజకీయ విమర్శలకు, వ్యక్తిగత దూషణలకు, బూతులకు దిగి శాసనసభను రచ్చబండగా మార్చి సమయం వృధా చేయొద్దని హితవు పలికారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ముఖ్యంగా రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, వెనుకబడిన వర్గాల ప్రజల సమస్యలపై చర్చ జరపాలని కోరారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, పెండింగ్‌లో ఉన్న రైతు రుణ మాఫీ, నిరుద్యోగం, కృష్ణా-గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు వంటి కీలక అంశాలపై అర్థవంతమైన చర్చ జరపాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి,నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని తెలిపారు. గ్రామీణ పేదల జీవనాధారమైన జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని, పథకంగా మార్చి దాని స్ఫూర్తిని దెబ్బతీసిందని విమర్శించారు. నిధులకు కోత పెట్టి, పనిదినాలు తగ్గించేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. వీటిపై శాసన సభలో చర్చించాలనీ, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని జూలకంటి డిమాండ్ చేశారు.శాసన సభ నడిచే ప్రతి నిముషానికి రూ. లక్షలు ఖర్చు అవుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రజాధనాన్ని వృధా చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

అత్యాధునిక టెక్నాలజీతో మెరుగైన సేవలు

- 15 శాతం తగ్గిన నేరాలు
- హైదరాబాద్ సిపి విసి.సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేర నియంత్రణలో అత్యాధునిక టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు సాధించామని, గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 15శాతం నేరాలు తగ్గాయని హైదరాబాద్ సిపి విసి సజ్జనార్ తెలిపారు. గతేడాదితో పోల్చితే మహిళలు, చిన్నారులపై మాత్రం నేరాలు పెరిగాయన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసిసిసిలో శనివారం విలేకరుల సమావేశంలో 2025 వార్షిక నేర నివేదికను సీపీ విడుదల చేశారు. ఈసందర్భంగాసిపి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, నకిలీ వస్తువులు, విత్తనాల నియంత్రణపై డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో నార్కొటిక్ టీమ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్‌వన్ స్థాయిలో ఉన్నారని, గతంతో పోలిస్తే నగరంలో లా అండ్ ఆర్డర్ బాగుందని, క్రైమ్‌రేట్ అదుపులో ఉందని తెలిపారు. నగర పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఏ ఆపద వచ్చినా డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు. అత్యాశకుపోయి నగరవాసులు సైబర్ నేరాలలో చిక్కుకుంటున్నారని, వాటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నగర వ్యాప్తంగా ఐదు లక్షల 20 వేల సిసి కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు.



మహిళలపట్ల పెరిగిన నేరాలు

ఈ ఏడాది మహిళలపై (జరిగిన దాడులు, లైంగిక వేధింపులతోపాటు ఇతర నేరాలు) 6 శాతం నేరాలు పెరిగాయని సీపీ తెలిపారు. గతేడాది 2,482 వరకు కేసులు నమోదైతే, ఈ ఏడాది 2,625 కేసులు నమోదయ్యాయన్నారు. చిన్నారులపై సైతం (నేరాలు) దాడులు పెరిగాయన్నారు. ఈ క్రమంలో 7శాతం పోక్సో కేసులు అధికమయ్యాయన్నారు. చిన్నారులపై దాడులు, ఇతర నేరాలకు పాల్పడిన వారిపై 2024లో 449కేసులు నమోదైతే, ఈ ఏడాది 568కేసులు నమోదయ్యాయన్నారు. గతేడాది మహిళలపై లైంగికదాడి కేసులు 484 నమోదైతే ఈ ఏడాది 405 నమోదయ్యాయన్నారు. వీటితోపాటు 7 శాతం దోపిడీలు పెరిగాయని తెలిపారు. కిడ్నాప్ కేసులు 2024లో 324నమోదైతే,2025లో 166కేసులు నమోదయ్యాయన్నారు. ప్రాపర్టీ వివాదాల కేసులు 61శాతం పెరిగాయన్నారు. నేరస్థులకు శిక్షలు పడిన కేసుల సంఖ్య 68శాతం పెరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు సంఖ్య 3,058 నుంచి 2,678 తగ్గాయన్నారు. సైబర్ క్రైమ్ నేరాలు గతేడాదితో పోలిస్తే 8శాతం తగ్గాయన్నారు. హత్య కేసులు తగ్గాయన్నారు. డ్రగ్స్ కేసులు పెరిగాయన్నారు. డ్రగ్స్, గేమింగ్ యాప్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ కేసులకు సంబంధించి గతేడాదితో పోలిస్తే కేసులు పెరిగాయని, ఈ వ్యవహారంలో ఈ ఏడాది 368 కేసులు నమోదుకాగా, 2,690 మంది నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకల్లో జాగ్రత్త

న్యూ ఇయర్ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సీపీ సూచించారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తీర్చేందుకు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. నగర వాసులు సాధ్యమైనంత మేరకు ప్రజారావాణను ఉపయోగించాలని కోరారు.

అంతర్జాతీయ ఇన్నోవేషన్ సమ్మిట్‌కు కెటిఆర్‌కు ఆహ్వానం

- దుబాయ్‌లో జనవరి 9 నుంచి 11 వరకు నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె తారక రామారావు (కెటిఆర్)కు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం అందింది. వచ్చేనెల తొమ్మిది నుంచి 11 వరకు దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ జునికార్న్, గ్లోబల్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో గౌరవ అతిథిగా పాల్గొనాలని ప్రతినిధులు శనివారం ఆహ్వానించారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాల్లో కేటీఆర్ చేసిన కృషిని గుర్తిస్తూ ఈ ఆహ్వానం పంపించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత వంటి రంగాల్లో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లాభాపేక్ష లేని సంస్థ అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు వంద మందికిపైగా అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, యువ ఆవిష్కర్తలు పాల్గొంటారు. జునికార్న్ 100కె చొరవ ద్వారా గ్రామీణ యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టిసారించనుంది. ఈ అంతర్జాతీయ వేదికపై కెటిఆర్ భాగస్వామ్యం యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుందని, తెలంగాణ ఇన్నోవేషన్ మోడల్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తుందని నిర్వాహకులు ఆకాంక్షించారు.

కోతులను తప్పించబోయి.. ఆటో బోల్తా

- ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అడ్డు వచ్చిన కోతులను తప్పించబోయి ఆటో అదుపు తప్పి చెరువులోకి బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లాలో శనివారం జరిగింది. జోగిపేట ఎస్ఐ పాండు తెలిపిన ప్రకారం.. జమ్మికుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి.. తనతోపాటు అదే గ్రామానికి చెందిన విజయరావు (55)ను ఆటోలో ఎక్కించుకొని గ్రామం నుంచి జోగిపేట వైపు బయలుదేరారు. అందోల్ మండలం అన్నాసాగర్ చెరువు కట్టపై ఆటోకు అడ్డుగా ఒక్కసారిగా కోతులు వచ్చాయి. దీంతో డ్రైవర్ వాటిని తప్పించే ప్రయత్నం చేయగా.. అదుపు తప్పి ఆటో బోల్తా కొట్టి చెరువులో పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న విజయరావు (55) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రామిక విభజనను వ్యతిరేకిద్దాం

- కార్మిక సంఘాలకు 2026 కీలక ఏడాది
- ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సాధారణ సమ్మె
- సిఐటియు ఖమ్మం జిల్లా కార్యాలయ భవన ప్రారంభోత్సవంలో ఎకె పద్మనాభన్
- ఖమ్మంలో కార్మికుల భారీ ర్యాలీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎకె పద్మనాభన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రామిక విభజనను వ్యతిరేకిస్తూ.. మిలిటెంట్ పోరాటాలకు కార్మికులు సమాయత్తం కావాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ ఏకే పద్మనాభన్ పిలుపునిచ్చారు. 2026 ఏడాది శ్రామికలోకానికి కీలక సంవత్సరం అవుతుందన్నారు. మోడీ ప్రభుత్వ శ్రామిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశవ్యాప్త సాధారణ సమ్మెను విజయవంతం చేయాలని అన్నారు. ఖమ్మంలో నూతనంగా నిర్మించిన సిఐటియు జిల్లా కార్యాలయం (బిటీ రణదివే) భవనాన్ని పద్మనాభన్ శనివారం ప్రారంభించారు. అంతకుముందు ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి నిర్వహించిన ర్యాలీలో సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య తదితరులతో కలిసి పాల్గొన్నారు. యూనియన్ జెండాను సీనియర్ నాయకులు పి.రాజారావు ఆవిష్కరించిన అనంతరం భవనాన్ని పద్మనాభన్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

వర్గపోరాటాల్లో సిఐటియు పాత్ర భిన్నం

బిటి రణదివే పేరుతో ఉన్న స్మారక భవనాన్ని ప్రారంభించే అవకాశం రావటాన్ని గౌరవంగా భావిస్తున్నానని పద్మనాభన్ అన్నారు. సీఐటీయూ అన్ని ట్రేడ్ యూనియన్ల వంటిది కాదన్నారు. వర్గపోరాటాలు నిర్వహించటంలో దీని పాత్ర భిన్నమైనదని, సవాళ్లతో కూడుకున్నది అన్నారు. అనేక సవాళ్లను 1974 ఎమర్జెన్సీ సమయంలో, పివి నర్సింహారావు ప్రవేశపెట్టిన సంస్కరణల సమయం, నయా ఉదారవాద ఆర్థిక విధానాల సమయంలో సీఐటీయూ అనేక సవాళ్ల ఎదుర్కొందని వివరించారు. మోడీకి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో కార్మికులంతా మిలిటెంట్‌గా పాల్గొనాలని కోరారు. శ్రామికులను విభజించే విధానాన్ని కేంద్రం కొనసాగిస్తోందని, మతపరమైన విధానాలను తీసుకొచ్చి విభజనకు పాల్పడుతోందని అన్నారు. సంయుక్త కిసాన్ మంచ్ పేరుతో అన్ని కార్మిక సంఘాలు కలిసి పోరాటం చేస్తున్నాయన్నారు. కార్పొరేట్లకు బిజెపి ప్రభుత్వం ఊడిగం చేస్తోందని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు విమర్శించారు.

వేతన కుదింపుకే ఉపాధిహామీ ఎత్తివేత

ఉపాధిహామీ చట్టాన్ని ఎత్తివేస్తే పట్టణాలపై ఒత్తిడి పెరిగి కూలి రేట్లను తగ్గించొచ్చనే పెట్టుబడిదారీ ఆలోచనను మోడీ ప్రభుత్వం అమలు చేస్తోందని వ్యవసాయ కార్మికసంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. ఉపాధిహామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ కార్మికులది మాత్రమే కాదని, రైతులు, కార్మికులందరిదీ అని సూచించారు. కార్మిక కోడ్‌లతో వ్యవసాయ కార్మిక చట్టాలన్నీ రద్దవుతాయని తాము ఎప్పటినుంచో హెచ్చరిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. జీరామ్‌జీ చట్టంతో ఉపాధి ఉండకపోగా కార్పొరేట్లు ఎంట్రీ ఇస్తారని తెలిపారు. హిట్లర్ లాంటివాళ్లే ఎర్రజెండాను చూసి ఆత్మహత్య చేసుకున్నారని, ఏదో ఒకరోజు నరేంద్రమోడీకి కూడా ఆ గతి పడుతుందని హెచ్చరించారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, బి.మధు, రాష్ట్ర నాయకులు జ్యోతి, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నున్నా నాగేశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వజ్రాల శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పిన్నింటి రమ్య, సిఐటియు జిల్లా ఆఫీస్‌బేరర్లు పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, వై విక్రమ్, ముదాం శ్రీనివాసరావు, చలమల విఠల్‌రావు, జిల్లా ఉపేందర్, బి కోటేశ్వరి, బండారు యాకయ్య, ముత్తేమాల ప్రసాద్, ఎం.తిరుమలాచార్యులు, మల్లూరు చంద్రశేఖర్, జలారపు మంగమ్మ పాల్గొన్నారు.

పింఛన్‌ను పైసలు ఢిల్లీకి మూటలు
రేవంత్ ఒక్క భాషలో తిడితే.. నాకు నాలుగు భాషలు వచ్చు

- సర్పంచుల నిధులు ఎవరూ ఆపలేరు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రాష్ట్రంలో రైతులకు రెండు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిన దొంగ సిఎం రేవంత్ రెడ్డి.. మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు.. పేదలకు పెంచి ఇవ్వాల్సిన పింఛన్ డబ్బులను ఢిల్లీకి మూటలు కట్టి పంపిస్తున్నారు' అని బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. శనివారం మహబూబాబాద్‌లో బిఆర్ఎస్ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో కెటిఆర్ ప్రసంగించారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుతంత్రాలు చేసినా బిఆర్ఎస్ సర్పంచ్‌లు 1,500 మంది గెలిచారన్నారు. బిఆర్ఎస్ సర్పంచ్‌లకు నిధులు ఇవ్వబోమని ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని.. కానీ రాజ్యాంగం, ఫైనాన్స్ కమిషన్ నిబంధన ప్రకారం కేంద్రం ఇచ్చే ప్రతి రూపాయికి 85 పైసలు నేరుగా సర్పంచ్‌ల ఖాతాల్లో పడతాయని చెప్పారు. ఎవరూ నిధులు ఆపలేరని, సర్పంచ్‌లు మరింత స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. 'సర్పంచ్ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమే.. ముందు మున్సిపల్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు సెమీఫైనల్.. 2028లో ఫైనల్ ఎన్నికలు ఉన్నాయి.. కెసిఆర్‌ను తిరిగి సిఎం చేయడమే లక్ష్యం' అని కెటిఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డికి ఒకటే భాష వచ్చని తనకు నాలుగు భాషలు వచ్చు అని, తాను నాలుగు భాషల్లో తిట్టగలనని, కానీ.. తనకు సంస్కారం అడ్డొస్తుందని అన్నారు.

కెసిఆర్ రైతులు అడగకుండా.. దరఖాస్తు చేయకుండా 11 సార్లు రూ.73 వేల ఓట్ల రైతుబంధు నిధులు జమ చేశారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రెండుసార్లు ఎగ్గొట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతుబంధు ఇస్తానని, అత్తకు రూ.నాలుగు వేల పింఛన్, కోడలికి రూ.2500 ఆత్మీయ భరోసా ఇస్తానని, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, రేవంత్ తులం బంగారం ఇచ్చే టైపు కాదని, మెడలో ఉన్న పుస్తెలతాడు ఎత్తుకుపోయే టైపు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు డిఎస్ రెడ్యా నాయక్, శంకర్ నాయక్, హరిప్రియ నాయక్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు సత్యవతి రాథోడ్, కెఎస్ఎన్.రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



కెటిఆర్.. ముందు నీ తప్పులను తెలుసుకో..
ఉప ఎన్నిక వస్తే నేనే గెలుస్తా..

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం ఎ.రేవంత్‌రెడ్డిని గెలిపించడం, ఓడించడం అనేది ప్రజలు చూసుకుంటారని, ముందుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాను చేసిన తప్పులను తెలుసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తిని ఏకవచనంతో మాట్లాడింది బీఆర్ఎస్ నాయకులేనన్నారు. సీఎం పదవికి గౌరవం ఇవ్వాలని, అది మరిచి విమర్శలు చేస్తే ప్రతి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ హిమాయత్ నగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. కేటీఆర్ వ్యక్తిగత విమర్శలు పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. ఇద్దరు మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నారని, వాళ్లు కేంద్ర మంత్రులా లేక రాష్ట్ర మంత్రులా స్పష్టత ఇవ్వాలన్నారు. హోంశాఖ సహాయ మంత్రి అయిన బండి సంజయ్ పరిధిలోనే దర్యాప్తు సంస్థలు ఉంటాయని, అవినీతిపై ఆధారాలుంటే విచారణ చేపట్టాలని అన్నారు. తన బలం కార్యకర్తలేనని, ఈ స్థాయిలో ఉన్నానంటే వారి వల్లేనన్నారు. తాను రాజీనామా చేయడానికి.. ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి ధైర్యం కూడా తన కార్యకర్తలేనని తెలిపారు. వారి అండతోనే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, ఇప్పుడు ఉప ఎన్నిక వస్తే తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

జిఓ 252ను సవరించాలి

- జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ 252ను సవరించాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వానికి సూచించారు.వర్కింగ్ జర్నలిస్టుందరికీ అకే తరహా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. జిఓ 252 మూలంగా సాధారణ జర్నలిస్టులతోపాటు డెస్క్ జర్నలిస్టులు, చిన్న, మధ్యతరహా పత్రికల విలేకర్ల ఉనుంచి అక్రిడిటేషన్లు కోల్పోతున్నామనే ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. జిఓను సవరించడం ద్వారా అర్హులైన వారందరికీ అక్రిటిడేషన్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కనీస ఉద్యోగ భద్రత లేదని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలు సైతం అంతంతగానే ఉన్నాయని అన్నారు. ఆరోగ్య బీమా అమలు కావడం లేదని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా హెల్త్‌కార్డులు జారీ చేయాలని కోరారు. మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు పరిహారం ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని గుర్తు చేశారు. ఇండ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. విధుల నిర్వహణ సందర్భంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యథా లీడర్... తథా క్యాడర్...

- బిజెపిలో కింది స్థాయికి పాకిన కుమ్ములాటలు
- రాష్ట్ర నాయకుల ముందే జిల్లా నాయకుల బాహాబాహీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమది అత్యంత క్రమశిక్షణ గల పార్టీ అని చెప్పుకునే బిజెపి నేతలు... తమ పార్టీ అగ్ర నాయకుల ముందే కుమ్ములాడుకుంటున్నారు. ఆ జిల్లా ఈ జిల్లా అనే తేడా లేకుండా బాహాబాహీకి దిగుతున్నారు. ఆ పార్టీ రాష్ట్ర అగ్రనేతల్లో ఉన్న కుమ్ములాటలు క్రమంగా కింది స్థాయికి పాకాయి. జిల్లా స్థాయి నాయకుల మధ్య తిట్లు, తొపులాటలు కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఈ విభేదాలు బయటపడ్డాయి. అక్కడ కిషన్‌రెడ్డి అన్ని తానై వ్యవహరించగా, మిగతా పెద్ద నాయకులు గెస్ట్ రోల్ పోషించారనే విమర్శలు వస్తున్నాయి. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రెడ్డి తలపట్టుకుంటున్నారు. నాయకులకు నచ్చజెప్పలేక, పార్టీని సమన్వయం చేయలేక ఆయన మదన పడుతున్నట్టు తెలుస్తోంది.

చిలికి చిలికి గాలివానలా...

తమ పార్టీలో ప్రోటోకాల్ పాటించడం లేదనీ, ఫొటోలు దిగే చోట, తమకు తెలియకుండా రాష్ట్ర నాయకులతో మాట్లాడుతున్నారంటూ ఇలా చిన్న, చిన్న విషయాలకే బీజేపీ నేతలు రోడ్డెక్కుతున్నారు. అవే పార్టీలో చిలికి, చిలికి గాలివానలా మారుతున్నాయి. కొన్ని నెలల క్రితం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కట్టు తప్పి పార్టీకి కొరకరాని కొయ్యగా మారారు. అగ్రనేతలపై బహిరంగ విమర్శలు చేయడంతో ఆయన్ను పార్టీ నుంచి బయటకు పంపించారు. ఆ తర్వాత కొంతకాలం పార్టీలో అంతర్గత కల్లోలం ఆగిపోయిందనే వాతావరణం కనిపించింది. కానీ అది నివురు కప్పిన నిప్పులా రాజుకుంటోంది. ఒక్కసారిగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. తమ సొంత సోషల్ మీడియాలో ఎవరికి వారే తమ వీడియోలను వైరల్ చేసుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి కొనసాగింపుగా మరోసారి అంతర్గత విభేదాలు బహిరంగంగా బయటపడ్డాయి.

పైకి నవ్వులే కానీ లోపల కత్తులు

ఒకవైపు రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, మరోవైపు మాజీ అధ్యక్షులు బండి సంజయ్, ఇంకో వైపు కీలక నేత, ఎంపీ ఈటల రాజేందర్ ఈ ముగ్గురి మధ్య సమన్వయం లేకపోవడం పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. పైకి నవ్వుతూ కనిపించినా, లోపల మాత్రం వారు కత్తులు నూరుకుంటున్నారు. పైస్థాయి నేతల మధ్య ఉన్న విభేదాలే కిందస్థాయి క్యాడర్‌ను వర్గాలుగా చీల్చుతున్నాయన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. బండి సంజయ్ శైలి, ప్రస్తుత నాయకత్వానికి నచ్చడం లేదన్న భావన కేడర్‌లో ఉంది. ఇదే సమయంలో వారిద్దరి అనుచరులు సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటుండటం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తోంది. మల్కాజిగిరిలో ఎంపీగా ఈటల రాజేందర్ విజయం సాధించడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ ఆయనకు పార్టీ కీలక నిర్ణయాల్లో తగిన ప్రాధాన్యత కల్పించకపోవటంతో ఈటల అనుచరులు, ఇతర వర్గాల మధ్య కూడా అంతర్గత ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.

జిల్లాల్లో రచ్చకెక్కుతున్న వైనం

ఇప్పటివరకు అంతర్గత అంశాలకే పరిమితమైన విభేదాలు ఇప్పుడు మీడియా ముందుకొస్తున్నారు. నేతలే విరుద్ధంగా మాట్లాడుకోవడం, కార్యక్రమాల్లో పరోక్ష విమర్శలు చేసుకోవడం, సోషల్ మీడియాలో పోస్టులుపెట్టడం వంటి పనులకు పాల్పడుతున్నారు. ఇటీవల పెద్దపల్లిలో పార్టీ నాయకులు నేతకాని వెంకటేశ్, గోసుల శ్రీనివాస్ మధ్య రచ్చ జరిగింది. వారిద్దరూ బహిరంగంగానే తిట్టుకున్నారు. పార్టీ రాష్ట్ర సారథి రాంచందర్‌రావు వారించినా వినకపోవడంతో కమలం పార్టీలో క్రమశిక్షణ ఏ స్థాయికి దిగజారిపోతోందో విధితమవుతున్నది. నల్లగొండ జిల్లా బిజెపి నేతలు ...కార్యాలయంలోనే కొట్టుకున్నారు. పార్టీ నేత నాగం వర్షిత్‌రెడ్డి అనుచరుడు పిల్లి రామరాజు యాదవ్‌పై వైరి వర్గం దాడి చేసింది. దీంతో కలత చెందిన ఆయన కింద కూర్చుకుని నిరసన తెలపడంతో కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడింది. బీజేపీ అంతర్గత కుమ్ములాటలు ఇలా రెండు జిల్లాలకే పరిమితం కాలేదు. కరీంనగర్, మేడ్చల్ జిల్లాల్లో బండి సంజయ్, ఈటల రాజేందర్ అనుచరుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. కొత్తగా పార్టీలో చేరిన వారిని పాత నాయకులు కలుపుకపోరనే విమర్శలు కూడా ఉన్నాయి. కండువా కప్పుకునేంతవరకే ఆ తర్వాత ఎవరూ ఎవర్ని పట్టించుకోవటం లేదనే ఆవేదన వ్యక్తమవుతున్నది. పైస్థాయి నేతల మధ్య ఐక్యత లేకపోవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తల్లో తీవ్ర అయోమయం నెలకొంది. ఎవరి వెంట నడవాలన్న సందేహంతో పార్టీ కార్యక్రమాలపై ఆసక్తి తగ్గుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల వేళ ఒకే దిశగా పని చేయాల్సిన క్యాడర్, అంతర్గత రాజకీయాల్లో చిక్కుకుపోయిందన్న విమర్శలు ఉన్నాయి.

సింగరేణిని ప్రయివేటీకరించేందుకు సర్కార్ కుట్ర

- దివాళా తీయించేందుకు సంస్థ సొమ్ము దుబారా
- డిపెండెంట్ ఉద్యోగాలివ్వడంలో నిర్లక్ష్యం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థను ప్రయివేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్ గౌతమ్‌ను కలిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. సంస్థను ఆర్థికంగా దివాళా తీయించి తద్వారా ప్రయివేట్‌కు ధారాదత్తం చేసే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలైన ఎస్‌పిడిసిఎల్, ఎన్‌సిపిడిఎల్ నుంచి సింగరేణికి రూ.42 వేల కోట్లు రావాల్సి ఉండగా, వాటిని చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా సంస్థ ఆర్థికంగా ఇబ్బందులు పడుతోందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సింగరేణికి ఆ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు జీతాల కోసం అగచాట్లు పడుతుంటే సంస్థకు చెందిన సొమ్మును సీఎం రేవంత్‌రెడ్డి దుబారా చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మెస్సీ ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌కు సింగరేణి సంస్థకు చెందిన రూ.100 కోట్లు వ్యయం చేశారని ఆరోపించారు. కార్మికుల బోనస్ విషయంలోనూ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. 2024 25 ఆర్థిక సంవత్సరంలో 6,394 కోట్ల నికర లాభం సాధించినా, బోనస్ కేవలం 2,360 కోట్లుగానే పరిగణించి 34 శాతం మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం 3చేశారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో మొత్తం లాభంపైనే బోనస్ ఇవ్వగా, ప్రస్తుతం 50 శాతం కోత విధించారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌బాల్ మ్యాచ్‌పై విచారణ చేస్తామని హెచ్చరించారు. అలాగే డిపెండెంట్ ఉద్యోగాలివ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మొత్తం వారసత్వ ఉద్యోగాల్లో సగం మందికి కూడా ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ బోర్డును క్రమం తప్పకుండా నిర్వహించి అర్హులందరికి న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డును వెంటనే సమావేశ పర్చి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విబి జి ఆర్ఎంఎం జి పెండింగ్ వేతనాలు చెల్లించండి

- మంత్రి సీతక్కకు ఉద్యోగుల జెఎసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (విబి జి ఆర్ఎంఎం జి) సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ఉద్యోగుల జెఎసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ ఎలభద్రి లింగయ్య ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కను శనివారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందించారు. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఏక పక్షంగా వ్యవహరిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పథకాన్ని నీరు గార్చేందుకే పేరు మార్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జెఎసి కో-చైర్మన్లు మోహన్ రావు, అంజిరెడ్డి, రాజశేఖర్, మురహరి విజయకుమార్, వెంకటరామరెడ్డి గిరి గౌడ్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల అరెస్టు ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల అరెస్టును బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె తారక రామారావు (కెటిఆర్) తీవ్రంగా ఖండించారు. ప్రజల గొంతుక అయిన టీయూడబ్ల్యూజే-టీజేఎఫ్ నాయకులు, పలువురు జర్నలిస్టులను అరెస్టు చేయడం, నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామిక పరిరక్షణ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన ఏడో గ్యారంటీ ఇదేనా?అని ప్రశ్నించారు. జర్నలిస్టుల ఆకాంక్షలకు విరుద్ధంగా ఇచ్చిన 252 జిఓను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కే కుట్ర అని విమర్శించారు. కొత్త జిఓ సాకుతో జర్నలిస్టుల అక్రిడిటేషన్లలో కోత విధించడం ద్వారా ప్రభుత్వం వారి ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని తెలిపారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు, నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ల పునరుద్ధరణ కోసం సాగే పోరాటంలో బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

జర్నలిస్టుల అరెస్టుకు హరీశ్‌రావు ఖండన

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల అరెస్టులను మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులకు కేసీఆర్ హయాంలో 26 వేల అక్రిడిటేషన్ కార్డులను ఇచ్చారని గుర్తు చేశారు. జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు అనే తేడా లేకుండా ఇచ్చామని తెలిపారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రిడిటేషన్ కార్డులను పదివేలకు తగ్గిస్తామని చెప్పడం దుర్మార్గమని విమర్శించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ జర్నలిస్టులను ఉగ్రవాదులుగా పోల్చడం దారుణమని పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే-టీజేఎఫ్ నాయకులు, జర్నలిస్టుల పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు : దాసోజు శ్రవణ్

పత్రికా స్వేచ్ఛను హరించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ల కోతపై శాంతియుతంగా వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన టియుడబ్ల్యుజె-టిజెఎఫ్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. వినతిపత్రం ఇవ్వడం నేరం కాదనీ, అది పౌరుల బాధ్యత అని తెలిపారు. ప్రశ్నించడం నేరం కానీ, అది రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని పేర్కొన్నారు. కలానికి బేడీలు వేయాలని చూడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని విమర్శించారు. ఇది జర్నలిస్టులపై జరుగుతున్న దాడి మాత్రమే కాదనీ, ప్రజల గొంతుకను నొక్కే ప్రయత్నం చేయడమని తెలిపారు.

తెలంగాణపై రూ.20 వేల కోట్ల భారం..

- కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల్లో కోతల ఫలితం
- ఒక్కో స్కీమ్ పేరిట రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.1,500 కోట్ల వరకు భారం
- అప్పులు, వడ్డీలతో అల్లాడుతున్న సర్కారుకు ఇది పెను సవాల్
- బడ్జెట్ దగ్గరికొస్తున్న తరుణంలో ఉన్నతాధికారుల తర్జనభర్జన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రాయోజిత పథకాల (సిఎస్ఎస్‌లు)కు ఇచ్చే నిధుల్లో కోతలు పెట్టిన మోడీ సర్కార్ రాష్ట్రాలకు వాతలు పెట్టింది. ఫలితంగా తెలంగాణపై ఏడాదికి సగటున రూ.20 వేల కోట్ల భారం పడుతోంది. గత ప్రభుత్వం లెక్కకు మిక్కిలిగా చేసిన అప్పులు, వాటికి వడ్డీలు కట్టలేక ఇప్పటికే నానా ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఇది మూలిగే నక్కపై తాటిపండు చందంగా తయారైంది. నేషనల్ హెల్త్ మిషన్, మిడ్ డే మీల్, పీఎం గ్రామీణ సడక్ యోజన, ఐసీడీఎస్, నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్, టీచర్ ఎడ్యుకేషన్ స్కీమ్, రాష్ట్రీయ మాధ్యమిక్ శిక్షా అభియాన్, పీఎం ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, గ్రీన్ రెవల్యూషన్ కృషోన్నతి యోజన, పిఎం ఫసల్ బీమా, ఉపాధి హామీ చట్టం తదితర పథకాల అమలుకు సంబంధించి కేంద్రం తన వాటాలను సగానికి పైగా తగ్గించటంతో రాష్ట్రాలపై పెను భారాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వంపై ఒక్కో పథకం రూపంలో ఏడాదికి సగటున రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.1,500 కోట్ల చొప్పున భారం పడుతోందని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం డిసెంబరు ముగింపు దశలో ఉంది. మరో రెండున్నర నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఏకంగా రూ.20 వేల కోట్ల భారాన్ని భరించాల్సి రావటం, అందుకనుగుణంగా నిధులను సర్దుబాటు చేయటం అత్యంత కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసలు కత ఇది...

మోడీ ప్రభుత్వం గద్దెనెక్కిన గత పదకొండేండ్ల నుంచి కేంద్రం క్రమక్రమంగా తన సంక్షేమ బాధ్యతలను తగ్గించుకుంటూ వస్తోంది. ఆ భారాన్ని రాష్ట్రాలపైకి నెడుతోంది. సెస్‌లు, సర్‌ఛార్జీల పేరుతో రాష్ట్రాలకు చట్టబద్ధంగా చెందాల్సిన పన్నులకు భారీ స్థాయిలో కేంద్రం గండికొడుతోంది. తద్వారా వాటిని ఆర్థికంగా చిదిమేస్తోంది. కేంద్ర నిధులతో దేశంలో దశాబ్దాలుగా అమలవుతున్న అనేక పథకాల్లో తన వాటాను తగ్గిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. వాటి నిర్వహణ వ్యయాన్ని రాష్ట్రాలపై మోపుతోంది. దీంతో రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన దెబ్బతింటోంది.

సెస్ పేరిట రూ.ఐదు లక్షల కోట్లకు గండి...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సెస్‌ల పేరిట రాష్ట్రాలకు చెందాల్సిన రూ.ఐదు లక్షల కోట్లను కేంద్రం కాజేసింది. మొత్తం పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో ఇది 21 శాతంగా నమోదైంది. ఈ ఐదు లక్షల కోట్లలో సగం నిధులు వచ్చినా రాష్ట్రాలు సంక్షేమ పథకాలను సులభంగా అమలు చేసే వీలుంటుంది. కానీ మోడీ సర్కార్ దీనికి మోకాలడ్డుతోంది. పైగా కేంద్ర ప్రాయోజిత పథకాల్లో తన వాటాను తగ్గించుకుంటూ...రాష్ట్రాల వాట పెంచుతూ పోతుంది. తద్వారా ఒక్క 2025-26 బడ్జెట్‌లోనే కేంద్ర ప్రభుత్వం రూ. 91 వేల కోట్ల సెంట్రల్ షేర్‌ను తగ్గించుకుంది. ఆ మేరకు రాష్ట్రాలపై భారాలు పడ్డాయన్నమాట.

ఉపాధిలో 40 శాతం రాష్ట్రాలు భరించాల్సిందే...

ఇప్పుడు ఉపాధి హామీ చట్టం పేరును, దాని నియమ నిబంధలను, విధి విధానాలను మోడీ సర్కార్ పూర్తిగా మార్చేసింది. ఆ చట్టానికి సంబంధించి 40 శాతం నిధులను రాష్ట్రాలే భరించాలంటూ చట్ట సవరణ చేసింది. ఇది రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని మరింత దుర్భరంగా మార్చే చర్యే.

కుట్ర ఇది...

ఈ మొత్తం పరిణామాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం రాష్ట్రాలన్నీ.. కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడేట్టు చేయటమే. వాటిని ఆ దుస్థితికి నెట్టేయటం ద్వారా రాష్ట్రాల ఆర్థిక-పరిపాలనా స్వావలంబనను క్రమంగా దెబ్బతీయాలన్నది కేంద్ర ప్రభుత్వ అసలు లక్ష్యంగా కనబడుతున్నది. ఇదే జరిగితే సమాఖ్య వ్యవస్థ పూర్తిగా ధ్వంసం కావటం ఖాయమని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ తర్వాత యూనిటరీ పాలనా విధానాన్ని రాష్ట్రాలపై బలంగా రద్దుతారని వారు హెచ్చరిస్తున్నారు.

యూరాలజీ విభాగంలో సబ్-స్పెషాలిటీ క్లినిక్‌లు

- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పంజాగుట్ట నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగంలో యూరో-ఆంకాలజీ, రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, పీడియాట్రిక్ యూరాలజీ మూడు సబ్-స్పెషాలిటీ క్లినిక్‌లను ప్రారంభించనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్లినిక్‌లు యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాహుల్ దేవర్ ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పెషాలిటీ బ్లాక్ 6వ అంతస్తులోని యూరాలజీ విభాగంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సేవల ద్వారా మూత్ర సంబంధిత క్యాన్సర్ వ్యాధులు, కిడ్నీ మార్పిడి చికిత్సలు, పిల్లల యూరాలజీ సమస్యలకు అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రజలకు నాణ్యమైన, వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని డైరెక్టర్ పేర్కొన్నారు.